వైద్యశాలల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి

కలెక్టర్ వేణుగోపాలరెడ్డి

గుంటూరు వెస్ట్: వేసవి తీవ్రంగా ఉన్న నేపథ్యంలో ప్రభుత్వాసుపత్రుల్లో విద్యుత్ అంతరాయం ఏర్పడకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టర్ చాంబర్‌లో జరిగిన వైద్యాధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ రోగులకు ఇబ్బందులు ఏర్పడకుండా, శస్త్ర చికిత్సలకు అంతరాయం ఉండకుండా జనరేటర్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. విద్యుత్ సబ్‌స్టేషన్స్‌లోని డెడికేటెడ్ ఫీడర్ల నుంచి 24 గంటల విద్యుత్ సరఫరా అయ్యే విధంగా ఇప్పటికే చర్యలు తీసుకున్నామన్నారు. జీజీహెచ్‌లో 13, చెస్ట్ ఆసుపత్రిలో, ఫీవర్ ఆసుపత్రుల్లో రెండేసి, తెనాలి ఆసుపత్రిలో 4 జనరేటర్లు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉన్నాయన్నారు. వీటిని ఎప్పటికప్పుడు పరిశీలించుకోవడం, పూర్తిస్థాయి డీజిల్‌ను అందుబాటులో ఉంచుకోవడం చేయాలన్నారు. ముఖ్యంగా బాలింతలు, చిన్నపిల్లలు ఉన్న ఏసీ గదుల్లో ఫ్యాన్లు, ఏసీలు నిరంతరం పని చేయాలన్నారు. ఇబ్బందులను ఎప్పటికప్పుడు తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ వివరించారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్ బాబు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి, అధికారులు, వైద్యులు పాల్గొన్నారు.

ఎంఈఓ అవినీతి ఆరోపణలపై ఆర్జేడీ విచారణ

విచారణకు ఎంఈఓ గైర్హాజరు

బల్లికురవ: ఎంఈఓ బి.రాఘవయ్యపై వచ్చిన అవినీతి ఫిర్యాదులపై పాఠశాల విద్య ఆర్జేడీ వీఎస్ సుబ్బారావు శనివారం విచారణ చేపట్టారు. స్థానిక ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. రెండేళ్లుగా ఉపాధ్యాయులను వేధింపులకు గురిచేయటం దుర్భాషలాడటం, అవినీతిపై ఇటీవల ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావుతో కలసి యూటీఎఫ్ నాయకులు ఆర్జేడీతో పాటు జిల్లా కలెక్టర్ రంజిత్ బాషా, డీఈఓ రామారావు, ఎంపీడీఓ సీహెచ్ కృష్ణ, రాష్ట్ర శాప్‌నెట్ చైర్మన్, అద్దంకి వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి బాచిన కృష్ణచైతన్యకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుల మేరకు స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో రికార్డులు పరిశీలించారు. బాధిత ఉపాధ్యాయులు ఎ.పవిత్ర, సుజాత, రాణి, సుమని, జాన్‌రాజ్, కె.ఏడుకొండలు, చెన్నారెడ్డి, పుల్లారెడ్డిలను విచారించారు. పింఛన్ చెల్లింపు, జీతం పెంపు, చైల్డ్ కేర్ బిల్లులు, మెడికల్ లీవ్ బిల్లులు, డెప్యూటేషన్, తుఫాన్ సందర్భంగా వరద బాధితుల సహాయ నిధి పేరిట, కార్యాలయ ఖర్చులు, దినపత్రికల బిల్లులు చెల్లింపు పేరిట తమ నుంచి ఎంఈఓ డబ్బు వసూలు చేశారని ఫిర్యాదు చేశారు. ఉపాధ్యాయుడు అంకాల్‌రెడ్డి, ఫైనాన్స్ వ్యాపారి కొండారెడ్డి ఇబ్బందులకు గురిచేసిన వైనంపై ప్రత్యేకంగా చర్చించారు. విచారణ సమయంలో ఎంఈఓ బీ రాఘవయ్య గైర్హాజరయ్యారు. అంతకు ముందు డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు రావడంతో ఉపాధ్యాయులు నిరసన తెలిపారు. తరువాత ఆర్జేడీ హాజరు కావడంతో ఉపాధ్యాయులు విచారణకు హాజరయ్యారు. ఆర్జేడీ వెంట పర్చూరు డెప్యూటీ డీఈఓ వెంకటేశ్వర్లు, ఆర్జేడీ కార్యాలయ ఏడీ కృష్ణ ఉన్నారు. కమిషన్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్‌కు జిల్లా కలెక్టర్‌కు విచారణ నివేదికలు అందించనున్నట్లు ఆర్జేడీ విలేకర్లకు తెలిపారు. కార్యక్రమంలో యూటీఎఫ్ బాపట్ల జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి శ్రీనివారావు, కోశాధికారి వెంకటేశ్వర్లు, మండల శాఖ బాధ్యుడు డీ శేషగిరి, చంటి శ్రీనివాసరెడ్డి గాలం రామాంజనేయులు, పాలపర్తి రామాంజనేయులు పాల్గొన్నారు.



బల్లికురవ ఎంఈఓ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్జేడీ

నగరంపాలెం ఎస్సైపై కేసు నమోదు

- యువతిని మోసం చేశారనే అభియోగంపై..
- స్వయంగా సీఐకు ఫిర్యాదు చేసిన యువతి

గుంటూరు ఈస్ట్: యువతిని మోసం చేసిన అభియోగంపై నగరంపాలెం స్టేషన్ ఎస్సై పై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. పల్నాడు జిల్లా రెంటచింతల మండలానికి చెందిన ఓ యువతి గుంటూరులో ఓ ప్రైవేటు హాస్టల్‌లో ఉంటూ ఉన్నత చదువులకు శిక్షణ పొందుతోంది. అయితే 2020 జనవరిలో నగరంపాలెం పోలీసుస్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న కె.రవితేజ సదరు యువతి ఆమె ఫోన్ నంబరు తీసుకుని పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని చెప్పి పెళ్లి చేసుకుంటానని హామీ ఇవ్వడంతో యువతి నమ్మి ఎస్సైకు శారీరకంగా దగ్గరైంది. అనంతరం ఎస్సై రవితేజ పెళ్లికి నిరాకరించడంతోపాటు కులంపేరుతో దూషించాడు. ఈవిషయం ఇంతటితో వదిలేయకపోతే చంపుతానని బెదిరించాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

స్టేషన్లో హైడ్రామా

కేసు నమోదు చేసిన అనంతరం మహిళ పోలీసులు వైద్య పరీక్ష నిమిత్తం జీజీహెచ్‌కు రావాలని సూచించారు. అయితే తనకు వైద్య పరీక్షలు ప్రస్తుతం అవసరం లేదని, ఎస్సై రవితేజను స్టేషన్‌కు పిలిపించి పెద్దల సమక్షంలో పెళ్లికి ఒప్పించుకుంటానని చెప్పింది. అయితే రవితేజ స్టేషన్‌కు రానందున కేసు నమోదు చేసిన అనంతరం చట్టప్రకారం వైద్య పరీక్షలు చేయించుకోవాలని పోలీసులు సదరు యువతిని కోరారు. అందుకు నిరాకరించింది. మహిళ పోలీసులు ఆసుపత్రికి తీసుకెళ్లే క్రమంలో స్టేషన్ గేటు మందు ఒక్కసారిగా విదిలించుకుని నేలపై కూర్చొని ఎస్సైను పిలిపించాలంటూ డిమాండ్ చేసింది. ప్రస్తుతం ఎస్సై అందుబాటులో లేదని, చట్టప్రకారం ముందుకు వెళ్లాలని ఎస్‌హెచ్‌ఓ హైమారావు ఆమెకు సర్దిచెప్పే ప్రయత్నంలో విఫలమయ్యారు. యువతి పోలీసు స్టేషన్‌లోనే కూర్చొని ఎస్సై వచ్చేవరకు ఇక్కడి నుంచి కదలనంటూ భీష్మించడం గమనార్హం.

కేఎల్‌యూలో శాస్త్రీయ, జానపద నృత్య పోటీలు

తాడేపల్లిరూరల్: రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కె.ఎల్. విశ్వవిద్యాలయంలో నటరాజ నాట్యాలయం, న్యూమాంగ్స్ కుంగ్‌ఫూ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో శనివారం జాతీయస్థాయి శాస్త్రీయ, జానపద, నృత్య పోటీలు ప్రారంభమయ్యాయని విద్యార్థి సంక్షేమ విభాగాధిపతి డాక్టర్ చప్పిడి హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దక్షిణ భారతదేశంలో వున్న అన్ని రకాల యుద్ధ కళలు, నాట్యమయూరి, నాట్య భగీరథ, భరతనాట్యం, కూచిపూడి, కథకళి వంటి వివిధ శాస్త్రీయ, జానపద నృత్యాలతో పాటు యుద్ధ కళలను ప్రదర్శించడానికి ఆంధ్రప్రదేశ్, తెలంగాణాతో పాటు ముంబై వంటి పలు ప్రాంతాల నుండి కళాకారులు హాజరయ్యారన్నారు. అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయ సాంస్కృతి కళలను నేటి తరానికి పరిచయం చేయడమే తమ లక్ష్యమన్నారు. ఈ పోటీలలో సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ విభాగాలలో అత్యంత ప్రతిభ కనబరిచిన కళాకారులకు ఆదివారం బహుమతులను ప్రదానం చేయనున్నామని వివరించారు. నృత్య ప్రదర్శనకు న్యాయనిర్ణేతలుగా విశాఖకు చెందిన ప్రభాకర్, హైదరాబాద్ నుంచి పోతిని శ్రీనివాసరావు, గుమ్మళ్ళ ప్రభాకరరావులు వ్యవహరించగా, నిర్వాహకులు కె.ఎల్.యు. చైర్మన్ కోనేరు సత్యనారాయణ, విశ్రాంత ఎస్పి సి.హెచ్ చక్రపాణి, ఎం.ఎస్. రవికుమార్, కె. రాజశిఖామణి, జి.వి.ఎస్.ఆర్. ప్రసాద్, నంది అవార్డు గ్రహీత ఎస్. రాజ్‌కుమార్, మువ్వ గోపాల ఆర్ట్స్ అకాడమీ కళ్యాణ్, జి. రాఘవ, ఎయిర్ ఇండియా నుంచి ఎం.ఎస్. విజయ్, హైకోర్టు న్యాయవాది డాక్టర్ దామోదరంలు పాల్గొన్నారని, కళాకారులను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి. పార్థసారధి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఎ.వి.ఎస్. ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, తదితరులు అభినందించారు.



కళాకారిణులతో కేఎల్‌యూ డీన్ సిహెచ్. హనుమంతరావు

జగనన్న ఇళ్ల నిర్మాణంలో పురోగతి చూపాలి

జెడ్పీ సీఈఓ మోహనరావు

భట్టిప్రోలు: జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలపై అధికారులు పురోగతి చూపాలని.. లేకుంటే సహించేది లేదని గుంటూరు జిల్లా పరిషత్ కార్యనిర్వాహణాధికారి(సీఈఓ) జె. మోహనరావు అన్నారు. భట్టిప్రోలు మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, హౌసింగ్, మండల సమాఖ్య సిబ్బందితో సమీక్ష సమావేశం శనివారం నిర్వహించారు. మోహనరావు మాట్లాడుతూ పంచాయతీ కార్యదర్శులు గృహ నిర్మాణాలపై తమకు బాధ్యత లేదన్నట్లు వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తుందని అసంతృప్తి వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో పని చేసి లబ్ధిదారులతో మాట్లాడి గృహ నిర్మాణాలు చేపట్టేలా చూడాలని ఆదేశించారు. జగనన్న కాలనీల్లో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు మౌలిక సదుపాయాలు సమకూర్చినప్పటికి పురోగతి లేకపోవడంపై ఆయన అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తమకు నిర్దేశించిన లక్ష్యాలను నూటికి నూరు శాతం పూర్తి చేయాలని ఆ దిశగా వలంటీర్లతో ఎప్పటికప్పుడు భేటీ అవుతూ లబ్ధిదారులను గృహ నిర్మాణాలు చేపట్టేలా చేయాలని కోరారు. వారం రోజుల్లో గృహ నిర్మాణాలలో పురోగతి చూపాలని పేర్కొన్నారు. సచివాలయాల వారీగా గృహాలు కట్టుకోని లబ్ధిదారులు గూర్చి ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో మాట్లాడి ఎందుకు కట్టుకోవడంలేదో అడిగి తెలుసుకున్నారు. గృహ నిర్మాణాలలో వెనుకబడిన భట్టిప్రోలు, ఓలేరు, పెదపులివర్రు సచివాలయాల సిబ్బందికి ప్రత్యేక సూచనలు చేశారు. సమావేశంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ సభ్యురాలు తిరువీధుల ఉదయభాస్కరి, ఎంపీడీఓ గుమ్మా చంద్రశేఖరరావు, హౌసింగ్ ఏఈ రావూరి సౌమ్య, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జెడ్పీ సీఈఓ మోహనరావు

చంద్రబాబూ నోరు అదుపులో పెట్టుకో

ఎమ్మెల్సీ పోతుల సునీత

చీరాల: చంద్రబాబు వయసు మీద మతిస్థిమితం కోల్పోయి ఏదేదో మాట్లాడుతున్నాడు, నోరు అదుపులో పెట్టుకోవాలని ఎమ్మెల్సీ పోతుల సునీత హెచ్చరించారు. శనివారం కొత్తపేటలోని నివసంలో విలేకరులతో మాట్లాడారు. చంద్రబాబు నాయుడు అనకాపల్లి సభలో ఇష్టానుసారంగా మాట్లాడన్నారు. వెన్నుపోటు, మోసపూరిత రాజకీయాలు ఆయన చరిత్ర అన్నారు. అమరావతిని భ్రమరావతి చేశాడు, పోలవరాన్ని ఏటీఎంలా వాడుకున్నాడన్నారని విమర్శించారు. చంద్రబాబు దుర్మార్గపు మోసపూరిత మాటలతో ప్రజలను వంచించారన్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అమరావతిలో 50 వేల మంది పేద ప్రజలకు ఇంటి నివేశన స్థలంతో పాటు ఇళ్లు మంజూరు చేస్తున్నారని తెలిపారు. చంద్రబాబు నాయుడుకి 2024లో కూడా ప్రజలే బుద్ధిచెప్తారన్నారు. వైఎస్సార్ సీపీ 175 సీట్లుకు 175 సీట్లు గెలవడం ఖాయమన్నారు.

గుంటూరులో డ్రగ్ విక్రేత అరెస్టు

నగరంపాలెం: ఎండీఎంఏ డ్రగ్‌ను విక్రయించే యువకుడ్ని ఎస్‌ఈబీ (సెబ్) గుంటూరు-1 పోలీసులు అరెస్ట్ చేశారు. బ్రాడిపేటలోని స్టేషన్ కార్యాలయంలో శనివారం కేసు వివరాలను సీఐ రమేష్ తెలిపారు. సెబ్ ఏఎస్పీ డీఎస్.మహేష్ ఆదేశాల మేరకు శనివారం నెహ్రూనగర్ పరిధిలోని మోతీలాల్‌నగర్‌కు చెందిన పఠాన్‌మున్నా అనే యువకుడిని అదే ప్రాంతంలోని రైల్వేగేటు వద్ద అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద 4.23 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్‌ను గుర్తించి సీజ్ చేసి, అరెస్ట్ చేసినట్లు సీఐ తెలిపారు. మున్నా సీలింగ్ పనులు చేసేవాడని, గతంలో కొంత కాలం బెంగుళూర్‌లో ఉన్నట్లు చెప్పారు. ఈ క్రమంలో డ్రగ్‌కు బానిసగా మారాడు. మొబైల్ ఫోన్, వాట్సాప్ ద్వారా విక్రయాలు చేసేవాడని దర్యాప్తులో గుర్తించామని అన్నారు. అతనిపై కొత్తపేట పీఎస్‌లో ఒక కేసు ఉందని తెలిపారు.



యువకుడిని అరెస్ట్ చేసిన సెబ్ సీఐ

చోరీ కేసులో నిందితుల అరెస్టు

బాపట్ల: దొంగతనాలే లక్ష్యంగా చేసుకొని చోరీలకు పాల్పడుతూ చెడు వ్యసనాలకు బానిసలైన ఇద్దరు నిందితులను బాపట్ల రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుల నుంచి రూ.2లక్షలు నగదు, వెండివస్తువులను స్వాధీనం చేసుకున్నారు. బాపట్ల డీఎస్పీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు వివరాలు వెల్లడించారు. గుంటూరు జిల్లా అమరావతి రోడ్డు శారద కాలనీకి చెందిన చిల్లర సురేష్, పెద్దనందిపాడుకు చెందిన కిరణ్‌బాబు బాపట్ల మండలం చెరువు జమ్ములపాలెంలో ఓ ఇంటిలో చొరబడి బంగారం రెండు లక్షల డబ్బులు అపహరించారన్నారు. అదే విధంగా పెద్దనందిపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో రెండు గృహాలలో బంగారు వెండిని చోరీ చేయడంతో పాటు, చిలకలూరిపేట రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ ప్రాంతంలో వెండితో పాటు, రూ.75 వేలు చోరీ చేశారన్నారు. ఈనెల 19వ తేదీన బాపట్ల మండలం ఉప్పరపాలెంలో నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతూ ఉండడంతో ఎస్‌ఐ ప్రసాద్‌కు రాబడిన సమాచారంతో ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించగా పలు ప్రాంతాలలో దొంగతనం చేశామని అంగీకరించారన్నారు. చిల్లర సురేష్‌పై 70 కేసులు, కిరణ్‌పై 30 కేసులు ఉన్నాయని వివరించారు. ఇరువురిని అదుపులోకి తీసుకొని వారి వద్ద ఉన్న వెండి వస్తువులు, రూ.రెండు లక్షల నగదును స్వాధీనం చేసుకొని నిందితులను కోర్టుకు హాజరు పరుస్తున్నామన్నారు.

జేవీకే కిట్ల పంపిణీ సమర్థంగా చేపట్టాలి

చినగంజాం: జగనన్న విద్యా కానుక కిట్ల పంపిణీని సమర్థవంతంగా నిర్వహించాలని బాపట్ల జిల్లా విద్యాశాఖాధికారి పీవీజే రామారావు సూచించారు. శనివారం ఆయన చినగంజాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక స్టాక్ పాయింట్‌ను పరిశీలించారు. స్టాక్ పాయింట్‌కు చేరిన కానుకలోని వస్తువులు, యూనిఫాం కొలతలు, షూస్, బెల్ట్‌లు తదితర వస్తువుల వివరాలను పరిశీలించారు. వివరాలను మండల ఇన్‌చార్జి జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం డి రత్నకుమారిని అడిగి తెలుసుకున్నారు. బ్యాగ్‌లు, షూస్, బెల్టులు ప్రతి పాఠశాలకు రూట్ మ్యాప్ తయారు చేసుకొని ఆయా కాంప్లెక్స్‌ల పరిధిలోని సీఆర్పీలు వెంట ఉండి అన్ని పాఠశాలలకు జాగ్రత్తగా పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ కో ఆర్డినేటర్ మాజేటి మురళి, సీఆర్పీలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురు అరెస్టు

గుంటూరు ఈస్ట్: క్రికెట్ బెట్టింగ్ ఆడుతున్న ముగ్గురిపై పట్టాభిపురం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం ప్రకారం రామన్నపేట 1వలైనులో ముగ్గురు సెల్‌ఫోన్‌లో క్రికె ట్ బెట్టింగ్ ఆడుతున్నారన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసు కుని స్టేషన్‌కు తరలించారు. వారి వద్ద నుంచి మూడు సెల్ ఫోన్లు, రూ. 9,500నగదు స్వాధీనం చేసుకున్నారు.

స్థలాలపై మార్కెట్ విలువ పెంపు వాయిదా వేయాలి

క్రెడాయ్ ప్రెసిడెంట్ రాంబాబు, జనరల్ సెక్రటరీ శ్రీధర్

రామవరప్పాడు: ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న నిర్మాణ రంగం కోలుకోవడానికి మరింత సమయం పట్టనుందని, భూములు, స్థలాలపై మార్కెట్ విలువ పెంపుదల అంశాన్ని వాయిదా వేసి యథాస్థితిని కొనసాగించాల్సిందిగా క్రెడాయ్ ప్రెసిడెంట్ రాంబాబు, జనరల్ సెక్రటరీ వి.శ్రీధర్ శనివారం జిల్లా రిజిస్ట్రార్ దుర్గాప్రసాద్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా మహమ్మారి వల్ల నిర్మాణ రంగం కుదేలయ్యిందని తెలిపారు. నిర్మాణాలు ఎక్కడివక్కడ ఆగిపోయాయని, కార్మికులు వలస వెళ్లిపోయారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జూన్ 1 నుంచి భూములు, స్థలాల మార్కెట్ విలువ పెంచే నిర్ణయం తీసుకుంటుందని ప్రచారం జరుగుతోందని తెలిపారు. ఇదే జరిగితే నిర్మాణ రంగంపై అదనపు భారం పడుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈ ఏడాదికి భూములు, స్థలాలపై మార్కెట్ విలువల పెంపుదలను వాయిదా వేసి, యథాస్థితిని కొనసాగించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

అంతర్జాతీయ స్థాయిలో పెడన విద్యార్థుల సత్తా



పెడన: అంతర్జాతీయ సైన్సు ఫెయిర్‌లో పెడన విద్యార్థులు సత్తాచాటారు. అమెరికాలోని డల్లాస్‌లో ఈ నెల 13 నుంచి 19వ తేదీ వరకు జరిగిన ఇంటర్నేషనల్ సైన్సు అండ్ ఇంజినీరింగ్ ఫెయిర్‌లో 80 దేశాలకు చెందిన రెండు వేల ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఆంధ్రప్రదేశ్ నుంచి పెడన భట్ల జ్ఞానకోటయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు వినయ్‌కుమార్, మణికంఠ, ఉపాధ్యాయిని లక్ష్మీదేవి తయారు చేసిన 'స్మార్ట్ సొల్యూషన్ ఫర్ ఎకో పొల్యూషన్' ప్రాజెక్టు నాలుగో స్థానంలో నిలిచి 500 డాలర్ల బహుమతి గెలుచుకుంది. 64వ లండన్ ఇంటర్నేషనల్ యూత్ సైన్సు ఫోరం, మిస్సోరి యూనివర్సిటీ ఆఫ్ సైన్సు అండ్ టెక్నాలజీ వాషింగ్టన్ డీసీలో స్కాలర్‌షిప్ కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం లభించిందని ఉపాధ్యాయిని లక్ష్మీదేవి ఫోన్‌లో తెలిపారు. తాము సాధించిన విజయానికి విద్యాశాఖాధికారులు, ప్రముఖులు, ప్రజాప్రతినిధులు అభినందనలు తెలిపారని ఆమె పేర్కొన్నారు.

రక్త సంబంధ వ్యాధులకు అత్యాధునిక చికిత్స

లబ్బీపేట(విజయవాడతూర్పు): రక్త సంబంధ వ్యాధులకు చికిత్స అందించడంలో అత్యాధునిక వైద్య విధానాలు అందుబాటులోకి వచ్చాయని రక్తమార్పిడి సేవల ఇన్‌చార్జి జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కిషోర్ తెలిపారు. హిమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్, నేషనల్ హెల్త్ మిషన్, హిమోగ్లోబినోపతిష్ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో నగరంలోని హోటల్ ఫర్ట్యూన్ మురళీపార్కులో శనివారం శిక్షణ సదస్సు జరిగింది. హిమోగ్లోబినోపతిష్, హిమోఫీలియాపై జరిగిన ఈ సదస్సులో అన్ని బోధనాస్పత్రుల నుంచి జనరల్ మెడిసిన్, పీడియాట్రిక్స్ వైద్యులు, హిమోగ్లోబినోపతీస్ అండ్ టెస్టింగ్ సెంటర్ వైద్యులు పాల్గొన్నారు. రక్త మార్పిడి సేవలపై డాక్టర్ కిషోర్ విశ్లేషణాత్మకంగా వివరించారు. మంగళగిరి ఎయిమ్స్, విశాఖపట్నం, హైదరాబాద్, బెంగళూరుకు చెందిన నిపుణులు పాల్గొని అవగాహన కలిగించారు. సిద్ధార్థ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కంచర్ల సుధాకర్, హిమోఫీలియా సొసైటీ విజయవాడ చాప్టర్ ప్రతినిధి డాక్టర్ ఎం.బి.ఎస్. వి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సేవలో అధికార భాషా సంఘం అధ్యక్షుడు



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర అధికార భాషా సంఘం అధ్యక్షుడు పి.విజయబాబు కుటుంబ సమేతంగా శనివారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ఆయనకు ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఆలయ పాలక మండలి సభ్యులు బుద్దా రాంబాబు, ప్రధాన అర్చకుడు ఎల్.డి.ప్రసాద్ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

మచిలీపట్నానికి మూడు మణిహారాలు

అంతర్జాతీయ వాణిజ్య కేంద్రంగా శతాబ్దాల కిందట విరాజిల్లిన మచిలీపట్నం దిశదశా మారబోతోంది. ప్రముఖ ఓడరేవుగా గుర్తింపు పొందింది. పోర్చుగీస్, బ్రిటన్, డచ్, ఫ్రెంచ్ లాంటి యూరప్ దేశాలు 16వ శతాబ్దం వాణిజ్య కార్యకలాపాలు నిర్వహించాయి. శాతవాహనుల కాలంలో, గోల్కొండ నవాబుల పాలనలోనూ ఈ ప్రాంత ఘనత చరిత్ర పుటల్లోకెక్కింది. వజ్రాల ఎగుమతులు, రాగి నాణేల ముద్రణ, కళంకారీ వస్త్రాలతో పాటు విభిన్న వాణిజ్య కార్యకలాపాలతో తీరప్రాంత నగరంగా అభివృద్ధి చెందుతున్న దశలో ప్రకృతి వైపరీత్యాలు దెబ్బతీశాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రంలో 1859లో మచిలీపట్నం కేంద్రంగా కృష్ణా జిల్లా ఏర్పాటైంది. కొన్ని దశాబ్దాల కిందటి వరకు బందరు పరిస్థితి బాగున్నప్పటికీ ఆ తరువాత ప్రాభవం కోల్పోతూ వచ్చింది. దివంగత మహానేత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖరరెడ్డి పోర్టు నిర్మాణం ద్వారా బందరు పునర్వైభవానికి ప్రయత్నించారు. ఆయన తనయుడిగా ప్రస్తుత ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మచిలీపట్నం సర్వతోముఖాభివృద్ధికి శ్రీకారం చుట్టారు. ఒకటి కాదు రెండు కాదు మూడు నిర్మాణాలు మచిలీపట్టణానికి మణిహారాలు కానున్నాయి. ఈనెల 22న పోర్టు పనులు ప్రారంభం కానుండగా ఫిషింగ్ హార్బర్ పనులు 60 శాతం, వైద్య కళాశాల పనులు దాదాపు 80 శాతం పూర్తయ్యాయి. –సాక్షి, ప్రత్యేక ప్రతినిధి



మచిలీపట్నం పోర్టు పనుల ప్రారంభానికి సిద్ధమవుతున్న పైలాన్

- బందరుకు పోర్టు బంగారమే
- గంగపుత్రులకు హార్బర్ వరం
- పేదలకు వైద్య కళాశాల ఆపన్నహస్తం
- రేపు పోర్టు పనులకు సీఎం శంకుస్థాపన

బందరు పోర్టు...

మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి ముఖ్యమంత్రిగా బందరు పోర్టుకు 2008 ఏప్రిల్ 23న శంకుస్థాపన చేశారు. ఆయన అకాల మరణంతో నిర్మాణం మూలనపడింది. ఆ తరువాత వచ్చిన సీఎంలు శ్రద్ధ చూపలేదు. ఎన్నికలకు ముందు మాటిచ్చిన వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి బందరు పోర్టు నిర్మాణానికి కట్టుబడ్డారు. రూ.11,464 కోట్ల భారీ పెట్టుబడి... మొత్తం 16 బెర్తులు... 115.97 మిలియన్ టన్నుల సామర్థ్యంతో పోర్టు రూపుదిద్దుకోనుంది. తొలిదశలో రూ.5,156 కోట్లతో నాలుగు బెర్తుల నిర్మాణ పనులకు సీఎం ఈ నెల 22న శంకుస్థాపన చేయనున్నారు. తొలిదశలో 35 మిలియన్ టన్నుల వార్షిక సామర్థ్యంతో నిర్మాణాన్ని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు. రూ.3,668.83 కోట్ల విలువైన పనుల కాంట్రాక్టును రివర్స్ టెండరింగ్ విధానంలో మేఘా ఇంజినీరింగ్ లిమిటెడ్ దక్కించుకుంది.

నాడు- నేడు... ఇదీ తేడా

బందరు పోర్టుకు 2008లో మహానేత వైఎస్సార్ శంకుస్థాపన చేయగా ఆ తరువాత పట్టించుకున్న వారులేరు. 2014లో సీఎం అయిన చంద్రబాబునాయుడు ఎప్పటిలానే మాయమాటలతోనే తన పదవీకాలాన్ని ముగించేశారు. తనకున్న అలవాటు ప్రకారం ఎన్నికలకు ముందు 2019 ఫిబ్రవరి 7న కొబ్బరికాయ కొట్టి మమ అనిపించారు. 2019లో పాలనా పగ్గాలు చేపట్టిన సీఎం వైఎస్ జగన్ తొమ్మిది నెలల వ్యవధిలోనే... 2020 ఫిబ్రవరి 4న మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ పేరిట ప్రత్యేక సంస్థను ఏర్పాటు చేసి, పోర్టు నిర్మాణానికి పరిపాలనా అనుమతులను మంజూరుచేశారు. రూ.5,156 కోట్ల నిధులను సమకూర్చి చిత్తశుద్ధిని చాటుకున్నారు. అంతేకాక పర్యావరణ సంబంధిత అనుమతులు, పోర్టు నుంచి జాతీయ రహదారితో అనుసంధానానికి 6.5 కిలో మీటర్ల మేర నాలుగు వరుసల రహదారి, ఏడు కిలోమీటర్ల రైల్వే లైను నిర్మాణానికి అనుమతులు సాధించడంతో పాటు కాంట్రాక్టు సంస్థతో ఒప్పందాలు చకచకా సాగాయి.

స్థానిక ప్రజాప్రతినిధుల జోక్యం...

ఢిల్లీ స్థాయిలో పర్యావరణ అనుమతులు, ఆర్థికపరమైన వ్యవహారాలు, జాతీయ రహదారి, రైల్వే లైన్ నిర్మాణానికి అవసరమైన అనుమతులు వేగవంతంగా పొందడానికి మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరికి మార్గదర్శనం చేయగా, రాష్ట్ర, జిల్లా స్థాయిలో పనులు వేగవంతమవడానికి మాజీ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)ని సీఎం పురమాయించారు.

ఒక్క కృష్ణాకే కాదు...

బందరు పోర్టు, ఫిషింగ్ హార్బర్, మెడికల్ కాలేజీ ఏర్పాటుతో మచిలీపట్నం ఉమ్మడి కృష్ణా జిల్లాకే కాదు పరిసర జిల్లాలకు ఎనలేని ప్రయోజనాలు ఒనగూరనున్నాయి. పూర్వపు ఉభయగోదావరి, గుంటూరు జిల్లాల్లోని వివిధ ఉత్పత్తుల ఎగుమతులకు, దిగుమతులకు కేంద్రంగా మారనుంది. తీరాన దక్షిణాసియాకు ముఖద్వారమైన మచిలీపట్నం పోర్టు నుంచి తెలంగాణ ద్వారా నాగపూర్ వరకు సరుకు రవాణాకు మెరుగైన వసతులు సమకూరినట్టే. మచిలీపట్నం- పూణే జాతీయ రహదారి ఇందుకు ఉపయుక్తం కానుంది. చెన్నై- కోల్‌కత్తా నేషనల్ హైవే ఉండటం, కత్తిపూడి- ఒంగోలు ఎన్‌హెచ్ రూపుదిద్దుకుంటుడటం, రైల్వే మార్గాలు కలిసొచ్చే అంశాలు. 63 కిలోమీటర్ల దూరంలో గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం ఉండటం బందరు ప్రగతికి మరింత ఊతమిచ్చేదనేది పరిశీలకుల అంచనా.

జగనన్న కాలనీలతో కొత్తరూపు

పదహారు వేల మంది లబ్ధిదారులకు జగనన్న కాలనీలో గృహాల కేటాయింపు జరగనుంది. 2600 టిడ్కో ఇళ్లను పూర్తిచేసి లబ్ధిదారులకు అందజేయనుంది. తద్వారా నగర విస్తరణతో పాటు కొత్త రూపు సంతరించుకోనుంది.

పోర్టు ఆధారిత పారిశ్రామిక పార్కులు

మచిలీపట్నం పోర్టుతో పాటు పోర్టు ఆధారిత పరిశ్రమలను ప్రోత్సహించడానికి వీలుగా పారిశ్రామిక పార్కును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి పరిశ్రమల శాఖను ఆదేశించారు. ఎగుమతి, దిగుమతులకు సంబంధించిన పరిశ్రమల ఏర్పాటుకు వీలవుతుంది. తద్వారా ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి. రామాయపట్నం, మూలపేట పోర్టుల వద్ద కూడా పారిశ్రామిక పార్కుల ఏర్పాటుకు సీఎం ఆదేశించిన సంగతి తెలిసిందే.

జనాభా తగ్గింది మచిలీపట్నంలోనే...

దేశంలోని జిల్లా కేంద్రాల్లో జనాభా పెరుగుదల ఉంటుందే తప్ప తగ్గుదల సాధారణంగా ఉండదు. పెరుగుతున్న పట్టణీకరణే అందుకు కారణం. కానీ 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రకారం మచిలీపట్టణంలో– 5.3 శాతం (–5.3 శాతం) జనాభా తగ్గడం పరిశీలనాంశం. 1871లో మచిలీపట్నం జనాభా 36,188 కాగా వందేళ్లలో అంటే 1971 నాటికి 1,12,612 మందికి చేరింది. జనగణన ప్రకారం 1951లో 31.08 శాతం, 1961లో 30.1 శాతం పెరుగుదల నమోదైంది. 2001లో నగర జనాభా 1,79,353 ఉండగా 2011 నాటికి 1,69,892 కు తగ్గింది. ప్రస్తుత జనాభా అంచనా 2,32,000 ఉంది.

ఫిషింగ్ హార్బర్



మత్స్య సంపద, అక్కడి వ్యాపారం దృష్ట్యానే మచిలీపట్నానికి ఆ పేరు వచ్చింది. నాటి విదేశీ వ్యాపార రంగం ప్రధాన వాటా మత్స్య ఉత్పత్తులకు సంబంధించినవే. ఆ పూర్వ వైభవాన్ని దృష్టిలో ఉంచుకునే వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గిలకలదిండి వద్ద రూ.422 కోట్లతో ఫిషింగ్ హార్బర్ నిర్మాణాన్ని చేపట్టింది. 550 బోట్లు నిలపడానికి వీలుగా రూపుదిద్దుకుంటున్న హార్బర్ పనులు అరవై శాతానికి పైగా పూర్తయ్యాయి. ప్రత్యక్షంగా నాలుగు వేలకు పైగా మత్స్యకార కుటుంబాలు, అంతకుమించి పరోక్షంగా వేలాది కుటుంబాలు ఉపాధి అవకాశాలు, వ్యాపార ప్రయోజనాలు పొందనున్నాయి.

వైద్య కళాశాల...



మచిలీపట్నంతో పాటు పెడన, అవనిగడ్డ, పామర్రు, కై కలూరు, గుడివాడ, రేపల్లె తదితర నియోజకవర్గాల వారికి వైద్యకళాశాల వరప్రసాదమే. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూ.550 కోట్లతో చేపట్టిన కాలేజీ నిర్మాణ పనులు దాదాపు 80 శాతం వరకు పూర్తి అయ్యాయి. 65.74 ఎకరాల విస్తీర్ణంలో 13.94 లక్షల చదరపు అడుగులతో కాలేజీ రూపుదిద్దుకుంటోంది. 2023- 2024 విద్యా సంవత్సరంలో తరగతుల ప్రారంభానికి 150 మెడికల్ సీట్లను నేషనల్ మెడికల్ కౌన్సిల్(ఎన్ఎంసీ) అనుమతించింది. కృష్ణా విశ్వవిద్యాలయం కూడా దివంగత మహానేత వై.ఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే ఏర్పాటైన సంగతి తెలిసిందే.

మా ఊరు బాగుపడితే చాలు..

చంద్రబాబు గారికి ఎన్నిసార్లు చెప్పినా మా మాట చెవికెక్కించుకోలేదు. పోర్టు నిర్మాణం చేపట్టకపోతే జిల్లాలో పార్టీ పనైపోతుందని ఈ ప్రాంతం నాయకులం అందరం అనేకసార్లు మొత్తుకున్నాం. చివరికి దిగిపోయే ముందు తూతూ మంత్రంగా కొబ్బరికాయ కొట్టారు. ప్రజలేమన్నా పిచ్చోళ్లా. ఎన్నికల్లో కర్రు కాల్చి మా అందరికీ వాత పెట్టారు. అప్పట్లో రాజశేఖరరెడ్డి గారు పోర్టు కోసం గట్టిగా ప్రయత్నించారు. ఆ తరువాత మూలనపడింది. మా పార్టీ అధికారంలోకి వచ్చింది... మేం పూర్తిచేసి ప్రాంతాభివృద్ధికి పాటుపడదామని గట్టిగా ఆశించినా లాభం లేకపోయింది. జగన్‌మోహన్ రెడ్డి పోర్టు పనులపై శ్రద్ధ చూపుతున్నారు. మాకు అంతకన్నా కావాల్సింది ఏమీలేదు. ఎవరు మేలు చేసినా మేం కాదనం. వద్దనుకోం. రాజకీయాలు వేరు. అభివృద్ధి వేరు. మాకు కావాల్సింది మా ప్రాంతాభివృద్ధే. ఏడు పదుల వయసులో చిత్తశుద్ధితో ఈ మాటలు అంటున్నా... ఎక్కడైనా, ఎప్పుడైనా, ఎవరితోనైనా ఇదే గట్టిగా చెబుతా...

(– ఏం సార్ మీకు బందరు పోర్టు వచ్చేస్తుందిగా అని 'సాక్షి' ప్రస్తావించిగా టీడీపీకి చెందిన సీనియర్ మాజీ ప్రజాప్రతినిధి వ్యక్తం చేసిన అభిప్రాయం ఇది.)

తెలుగు'నాట క'ళా వైభవం

నాటకం.. చిటికెడు వినోదాన్ని, గుప్పెడు అనుభవాలను, దోసెడు అనుభూతులను, చారెడు విజ్ఞానాన్ని ప్రేక్షకులకు పంచి పెడుతుందని చెప్పాడో రచయిత. నాటకం సమకాలిన సమస్యలకు దర్పణం.. చరిత్రకు ప్రతిబింబం. సంఘ పరిణామాలను పసిగట్టి దగ్గరగా చూపెట్టే చుక్కాని. విజ్ఞానాన్ని, వినోదాన్ని, మానసిక చైతన్యాన్ని ప్రసాదించే వేదిక. ఇంతటి అమోఘమైన రంగం చవిచూసిన ఆటుపోట్లెన్నో.. అయినా ఇప్పటికీ తన ప్రాభవాన్ని చాటుతూనే ఉంది. రసజ్ఞుల హృదయాలను కదిలిస్తూనే ఉంది. తెలుగు నాటక రంగస్థల వైభవం సుస్థిరం.. సుమధురం.. ఈ నేపథ్యంలో నాటక రంగ పరిణామక్రమంపై సింహావలోకనం..

– గుంటూరు డెస్క్

- ఈ'నాటిక'దే స్ఫూర్తి
- ఎన్నో ప్రక్రియలు.. రూపాంతరాలు
- తొలి తెలుగు రూపకం 'క్రీడాభిరామం'
- సాంఘిక నాటకం 'నందక రాజ్యము'

రంగస్థలం.. చైతన్య ప్రస్థానం



స్థిరాస్తి నాటికలో ఓ సన్నివేశం (ఫైల్)

చిందు భాగవతం, యక్షగానం, వీధి భాగవతం, బయలాటగా పిలిచే ఈ నాటక ప్రక్రియ 16వ శతాబ్దంలో మొదలైంది. వీధి నాటకాలను ఎక్కువ ప్రచారంలోకి తెచ్చినవారు కూచిపూడి భాగవతులు. భారత అవతారికలో 'రసాన్విత కావ్య నాటకముల్ పెక్కుజూచితి' అనడాన్ని బట్టి, ఆదికవిగా పేరుగాంచిన నన్నయ కాలానికే నాటక ప్రదర్శనలు ఉండేవని అర్థం చేసుకోవచ్చు. నాడు సంస్కృతంలోనే నాటకాలు రాశారు. 15వ శతాబ్దంలో తెలుగులో వచ్చిన తొలి రూపకం వినుకొండ వల్లభరాయలు 'క్రీడాభిరామం'. తెలుగులో స్వతంత్ర నాటక రచన 1860లో కోరాడ రామచంద్రశాస్త్రి 'మంజరీ మధుకరీయం'తో మొదలైంది. 1875లో షేక్స్పియర్ 'జూలియస్ సీజర్'ను అనువదించిన తెనాలికి చెందిన వావిలాల వాసుదేవశాస్త్రి అనువాదాలకు ఆద్యుడు. తొలి సాంఘిక నాటకం 'నందక రాజ్యం' రచయిత కూడా ఈయనే. 1880లో కందుకూరి వీరేశలింగం రాజమండ్రిలో ధార్వాడ వారు వదిలివెళ్లిన పాకల్లో విద్యార్థుల చేత ప్రదర్శనలిప్పించి, తెలుగునాట నాటక ప్రదర్శనలకు ఆద్యుడయ్యారు. వ్యావహారిక భాషలో ఓ కొత్త మలుపు తెచ్చిన అత్యుత్తమ నాటకం 1892లో వచ్చిన గురజాడ అప్పారావు 'కన్యాశుల్కం' 1894 ప్రాంతంలో 'చారిత్రక నాటక పితామహుడు'గా పేరొందిన కోలాచలం శ్రీనివాసరావు చారిత్రక నాటకాలను రచించారు. షేక్స్పియర్ స్ఫూర్తి కలిగిన పానుగంటి లక్ష్మీనరసింహారావు 1900 కాలంలో వచన, రచన వ్యవహారికానికి దగ్గరగా ఉండేలా 30 స్వతంత్ర నాటకాల్ని రాశారు. 1913లో ప్రహసనాల ప్రదర్శనలు, నాటక పోటీల నిర్వహణ ప్రారంభమై దేశమంతటా విస్తరించింది.

స్వాతంత్ర్య పోరాటంలో..

సంస్కరణోద్యమం, స్వాతంత్ర్యపోరాటం ప్రభావంతో నాటకాలు విరివిగా వచ్చాయి. 1929లో తెనాలిలో ఆవిర్భవించిన ఆంధ్ర నాటక కళాపరిషత్, నాటకానికో దశ, దిశను చూపింది. 1943లో ప్రజానాట్యమండలి ఆవిర్భవించింది. 1944 నుంచి తెలుగు నాటక రచన, ప్రయోగాల్లో కొత్త ధోరణులు ప్రవేశించాయి. తర్వాత ఆంధ్ర రాష్ట్ర ఉద్యమానికి సంబంధించిన నాటకాలూ వెలిశాయి. 1935-44 మధ్య కాలంలో రేడియో రూపకం ఆవిర్భవించి బాగా అభివృద్ధి చెందింది. 1944-45 తరువాత సమకాలీన సాంఘిక పరిస్థితులకు అద్దంపట్టే రచనలు రాసాగాయి.

పోటీలతో నాటకాభిలాష

ఆంధ్ర నాటక కళాపరిషత్, ఆంధ్ర విశ్వకళాపరిషత్ పోటీలు అటు ఔత్సాహికులు, ఇటు విద్యార్థుల్లో నాటకాభిలాషను పెంపొందించాయి. 1947లో సుంకర- వాసిరెడ్డి 'మాభూమి' చారిత్రాత్మకం. 1970 తర్వాత మధ్యతరగతి కుటుంబాలు, రాజకీయ నేతల స్వార్థం, అవినీతి ఆలంబనగా ఎక్కువ రచనలు వచ్చాయి. 19980 నుంచి నాటకాల ఉధృతి తగ్గింది. 1990 తర్వాత గ్లోబలైజేషన్, మార్కెట్ ఎకానమీతో చేతివృత్తులు దెబ్బతిన్నాయి. వైవాహిక, స్త్రీ, పురుష సంబంధాల్లో విపరీత ధోరణులు ప్రవేశించాయి. డబ్బుకు ప్రాధాన్యం పెరిగింది. తరతరాలుగా వస్తున్న నమ్మకాలు, విశ్వాసాలు చెదిరిపోవటం మొదలైంది. అవన్నీ ప్రతిబింబిస్తూ అప్పుడప్పుడూ నాటక రచనలు రాసాగాయి.

కోవిడ్‌ను తట్టుకుని..

కోవిడ్ మహమ్మారి నాటక రంగంలోని కొందరిని బలి తీసుకోగా.. మరెందరో జీవితాలను ఛిద్రంచేసింది. రంగస్థలానికి శాశ్వతంగా తెరపడే సంక్షోభస్థితి ఏర్పడనుందని అంతా ఆందోళన చెందారు. కరోనా సద్దుమణిగాక మళ్లీ కొత్త ఆశలతో.. సరికొత్త మార్గాన నాటక రంగం పయనమవుతోంది. ఆజో-విభో-కందాళం ఫౌండేషన్ పాతికేళ్లకు పైగా కథానాటికల పోటీలను జరుపుతుండటం, విశాఖపట్నంలోని తెలుగు కళాసమితి ఏటా కథానాటికల రచనల పోటీల నిర్వహించటంతో కొత్త తరహా నాటకాలు వస్తున్నాయి. ఇప్పుడు నాటకరంగం, కళాకారులను పరిషత్‌లు, వాటిని పోషించే దాతలే బతికిస్తున్నారనేది నిజం.


నంది నాటకోత్సవాలతో కొత్తమలుపు

1998 నుంచి నంది నాటకోత్సవాల నిర్వహణతో నాటకరంగం కొత్త మలుపు తీసుకుంది. పరిషత్ పోటీల చట్రంలోనే నాటక రచనలు, ప్రదర్శనలు కొనసాగుతూ వచ్చాయి. మరోవైపు ప్రసార మాధ్యమాలు టీవీ షోలు, యూట్యూబ్ షార్ట్ ఫిలింస్, నెట్‌ఫ్లెక్స్, ప్రైమ్‌షో వెబ్‌సిరీస్‌ల ప్రభావం ఈ రంగంపై తీవ్రంగా పడుతోంది. ప్రేక్షకుల ఆదరణ లోపం అయితే ఉంది.

నాటకరంగ పరిపుష్టికి కృషి

ఇటీవల ఒక పరిషత్ పోటీల్లో ప్రముఖ నాటక, నవలా రచయిత యండమూరి వీరేంద్రనాథ్ మాట్లాడుతూ పరిషత్‌లు ఉన్నంతకాలం తెలుగు నాటకానికి ఢోకా లేదన్నారు. అదే వేదికపై ప్రముఖ రంగస్థల, టీవీ నటుడు, దర్శకుడు ఎస్‌కే మిశ్రో మాట్లాడుతూ కాలం మారుతున్నా, నాటకం మారటం లేదంటూ ఆవేదన చెందారు. ఇతివృత్తాలు ఆధునికతను ప్రతిబింబిస్తున్నా, నాటకం ఆధునికత సంతరించుకోలేదని అభిప్రాయపడ్డారు. ప్రదర్శనా పారితోషికం, నగదు బహుమతుల స్థాయి పెరగాలనేది ఆయన భావన. ఈ క్రమంలో పౌరాణిక పద్యనాటక/సాంఘిక నాటిక పోటీలను నిర్వహిస్తున్న తెనాలిలోని కళల కాణాచి పరిషత్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అత్యధిక పారితోషికం ఇస్తున్న సంస్థగా గుర్తింపును తెచ్చుకుంది. రావులపాలెం కళాపరిషత్ ఉత్తమ ప్రదర్శనకు రూ.3 లక్షల బహుమతిని అందించి మరో ముందడుగు వేసింది. ఇదే రీతిలో మరిన్ని పరిషత్‌లు ఆలోచన చేస్తే నాట రంగం పరిపుష్టం అవుతుందనడంలో సందేహం లేదు.

కళాకారులను ప్రోత్సహించడమే



కోవిడ్–19 ప్రభావం కారణంగా గత రెండేళ్లుగా నాటక పరిషత్‌లు నిర్వహించలేని పరిస్థితి నెలకొంది. ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తంగా పరిషత్‌లు నిర్వహిస్తున్నారు. దీంతో నాటక రంగానికి జీవం పోసినట్లయింది. ప్రభుత్వం ఆదరించడం ద్వారా తెలుగు నాటకరంగం మరింత అభివృద్ధి చెందడంతో పాటు ప్రగతి పథంలో పయనిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

– నాయుడు గోపి, పెదకాకాని, గుంటూరు జిల్లా వైఎస్సార్ ఎఛీవ్‌మెంట్ అవార్డు గ్రహీత, గంగోత్రి కళాపరిషత్ వ్యవస్థాపకులు

ప్రోత్సాహం భేష్



ప్రస్తుతం పరిషత్‌లతో నాటకాలకు మంచి ప్రోత్సాహం లభిస్తోంది. గతంలో స్త్రీపాత్రలకే పరిమితమైన పారితోషికాలు నేడు పురుషులకూ అందుతున్నాయి. నాటకరంగాన్ని అటు ప్రభుత్వం, ఇటు ప్రేక్షకులు ఆదరించి ప్రోత్సాహించాల్సిన అవసరం ఉంది. ప్రతి గ్రామంలోనూ కళావేదికలు నిర్మించి మౌలిక వసతులు కల్పించాలి. అప్పుడే నాటక రంగం మరింత వృద్ధి చెందుతుంది.

– గంగోత్రిసాయి, సీనియర్ నటులు, దర్శకులు

నాటకాన్ని బతికించాలి



గతంకంటే ప్రస్తుతం నాటక రంగానికి ఆదరణ ఉంది. పరిషత్‌లు, నంది నాటకోత్సవాలతో పునర్జన్మ లభించింది. మా తండ్రి స్ఫూర్తితోనే కళారంగానికి వచ్చాను. టీవీ, సినీ రంగాల్లో బిజీ అయినా నాటక రంగానికే నా తొలి ప్రాధాన్యం. ఏట పరిషత్ పోటీలు నిర్వహిస్తున్నాం. భావి తరాల కోసం చరిత్ర, సాహిత్యకారులు, కళారంగ ఉద్దండులు, సంఘ సంస్కర్తల వంటి మహానుభావుల జీవిత గాథల్ని నాటకీకరణ చేసి ప్రదర్శిస్తున్నాం.

– డాక్టర్ సీఎస్ ప్రసాద్, కాకినాడ, రంగస్థల, టీవీ, సినీనటులు

మహిళలకు అవకాశాలెన్నో..



డ్యాన్స్, సంగీతంలానే నాటక రంగంపై ఆసక్తిని పాఠశాల నుంచే నేర్పించాలి. ఇందుకు కళాకారులను ఫ్యాకల్టీలుగా నియమించాలి. నాటకరంగంలో మహిళలకు అవకాశాలెన్నో. ప్రోత్సాహమూ ఉంది. మంచి ఆదాయమూ ఉంది. నేను బీటెక్ పూర్తి చేశా. అక్కడ ఎంత సంపాదిస్తానో నాకిష్టమైన ఈరంగంలోనూ అంతకు మించి సంపాదిస్తున్నాను.

– గుడివాడ లహరి, గుంటూరు, రంగస్థల, టీవీ నటి

ఏపీ లా సెట్ కు 16,203 మంది హాజరు

ఏఎన్‌యూ: రాష్ట్ర వ్యాప్తంగా లా కోర్సుల్లో ప్రవేశానికి శనివారం నిర్వహించిన ఏపీ లా సెట్ -2023 ప్రవేశ పరీక్షకు 16,203 మంది హాజరయ్యారని ఏపీ లా సెట్ చైర్మన్, ఏఎన్‌యూ వీసీ ఆచార్య పి.రాజశేఖర్, కన్వీనర్ ఆచార్య బి.సత్యనారాయణ తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 84 కేంద్రాలలో పరీక్ష జరిగిందని వెల్లడించారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని కేంద్రాన్ని కో-కన్వీనర్ ఆచార్య నాగరాజు, రిజిస్ట్రార్ కరుణతో కలిసి వారు సందర్శించారు. ఏర్పాట్లను పరిశీలించారు. ఏఎన్‌యూ రెక్టార్ ఆచార్య వరప్రసాద్ మూర్తి గుంటూరులోని పరీక్ష కేంద్రాలను సందర్శించారు.

సీఎం కార్యక్రమానికి పటిష్ట భద్రత



చిలకలపూడి(మచిలీపట్నం): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లను చేయాలని కలెక్టర్ పి.రాజాబాబు అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో శనివారం వివిధశాఖల అధికారులు, ముఖ్యమంత్రి అంతర్గత భద్రతా విభాగం అధికారులతో కలిసి ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం ముఖ్యమంత్రి పర్యటించే ప్రాంతాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. తొలుత తపసిపూడి గ్రామంలో పోర్టు అభివృద్ధి పనులు జరిగే ప్రాంతంలో హెలిప్యాడ్ వద్ద భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. పైలాన్ ఏర్పాటు నిర్మాణ పనులను పరిశీలించి చుట్టూ బారికేడ్, గ్రీనరీ ఏర్పాటు చేయాలన్నారు. హెలిప్యాడ్ చుట్టూ పూర్తిస్థాయిలో బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. హెలికాప్టర్ ల్యాండింగ్, టేకాఫ్ సమయంలో దుమ్ము లేవకుండా ముందుగా వాటరింగ్ జరపాలని ముఖ్యమంత్రి భద్రతాధికారులు అధికారులకు సూచించారు.

అనంతరం పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. పరేడ్ గ్రౌండ్‌లో హెలికాప్టర్ దిగిన తరువాత సభాస్థలి వరకు రోడ్‌షో జరగనున్న దృష్ట్యా రోడ్డుకు రెండు వైపులా మెష్ బారికేడింగ్ ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్పీ పి.జాషువా, జాయింట్ కలెక్టర్ అపరాజితసింగ్, ఏఎస్పీలు రామాంజనేయులు, ఎస్‌డీపీ ప్రసాద్, ముఖ్యమంత్రి భద్రతాధికారులు యుగంధర్, మురళీధర్, ఆర్డీవోలు ఐ.కిషోర్, పద్మావతి, మచిలీపట్నం పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టర్ వై.విద్యాశంకర్ తదితర అధికారులు పాల్గొన్నారు.




నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో శనివారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.1.800, గరిష్ట ధర రూ.3.200, మోడల్ ధర రూ.2.400 వరకు పలికింది.



పిడుగుపడి చెట్టు దగ్ధం

సత్తెనపల్లి: ఇళ్ల మధ్య ఉన్న కొబ్బరి చెట్టుపై పిడుగు పడిన సంఘటన పట్టణంలోని రఘు రామ్ నగర్‌లో శనివారం జరిగింది. దీంతో కొబ్బరి చెట్టు మొదళ్లలో మంటలు చెలరేగాయి.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శనివారం 521.10 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి విడుదలవుతున్న నీటిని పూర్తిగా నిలిపివేశారు.

న్యూస్‌రీల్

రేపు వ్యవసాయ వర్సిటీ స్నాతకోత్సవం



బాపట్ల అర్బన్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం 55వ వార్షిక స్నాతకోత్సవం ను వ్యవసాయ కళాశాల బాపట్ల ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీన డాక్టర్ బి.వి.నాథ్ ఆడిటోరియం నిర్వహిస్తున్నట్లు ఉపకులపతి డాక్టర్ ఆదాల విష్ణువర్ధన్ రెడ్డి తెలిపారు. శనివారం బాపట్ల ఏజీ కాలేజీలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 55వ వార్షిక స్నాతకోత్సవానికి ముఖ్యఅతిథులుగా ఆంధ్రప్రదేశ్ గవర్నర్, విశ్వవిద్యాలయ కులపతి ఎస్.అబ్దుల్ నజీర్, రాష్ట్ర వ్యవసాయ, సహకార మార్కెటింగ్, ఆహార శుద్ధి శాఖ మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి పాల్గొననున్నట్లు వెల్లడించారు. డిపార్టుమెంట్ ఆఫ్ అగ్రికల్చర్ రీసెర్చ్ అండ్ ఎడ్యుకేషన్ మాజీ సెక్రటరీ ప్రొఫెసర్ రాజేంద్ర సింగ్ ఫరోడా పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర గవర్నర్ చేతుల మీదుగా 993 మంది విద్యార్థులకు డిగ్రీ పట్టాలు అందజేయడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో రిజిస్టర్ జి.రామారావు, డీన్ ఆఫ్ అగ్రికల్చర్ పి.సుధాకర్, డీన్ ఆఫ్ కమ్యూనిటీ సైన్స్ సి.హెచ్.చిరంజీవి, అసోసియేటెడ్ డీన్ వి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గవర్నర్ కోసం ఏర్పాట్లు పరిశీలన

బాపట్ల: బాపట్ల వ్యవసాయ కళాశాలలో ఈనెల 22న జరగనున్న 55వ స్నాతకోత్సవానికి రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ రానున్న దృష్ట్యా ఏర్పాట్లును జేసీ శ్రీధర్ పరిశీలించారు. కళాశాల్లోని బి.వి.నాథ్ ఆడిటోరియాన్ని పరిశీలించారు. విజిటర్ల రాక, విద్యార్థులు కూర్చొనేందుకు ఏర్పాట్లుపై వ్యవసాయ కళాశాల డీన్ డాక్టరు వి.శ్రీనివాసరావును వివరాలు అడిగి తెలుసుకున్నారు.

గోడౌన్ల పరిశీలన..

బాపట్ల పట్టణంలోని ప్రభుత్వ గోడౌన్లును జేసీ శ్రీధర్ పరిశీలించారు. స్టాక్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. గోడౌన్లను తరచుగా విజిట్ చేయాల్సిందిగా ఆర్డీఓ రవీంద్రబాబును ఆదేశించారు. తహసీల్దార్ సుధారాణి ఉన్నారు.

జేవీకే కిట్లు పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: అరండల్‌పేటలోని సెయింట్ ఇగ్నేషియస్ ఎయిడెడ్ గరల్స్ హైస్కూల్‌లో నిల్వ చేసిన జగనన్న విద్యాకానుక కిట్లను శనివారం ప్రభుత్వ పాఠ్య పుస్తక విభాగ డైరెక్టర్ కె.రవీంద్రనాథ్ రెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా గుంటూరు అర్బన్, రూరల్ పరిధిలోని పాఠశాలల విద్యార్థులకు పంపిణీకి సిద్ధం చేస్తున్న జేవీకే కిట్లలోని బ్యాగులు, యూనిఫాం, పుస్తకాలను పరిశీలించిన రవీంద్రనాథ్ రెడ్డి పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తిస్థాయిలో సామగ్రి వస్తుందని చెప్పారు. ఆయన వెంట జిల్లా పాఠ్య పుస్తక మేనేజర్ వి.వజ్రబాబు, సీఆర్పీలు ఉన్నారు.

మౌలిక సదుపాయాలపై దృష్టి

నరసరావుపేట: జిల్లాలోని 21 జగనన్న కాలనీల లేఅవుట్లలో ఇళ్ల నిర్మాణం కోసం తాత్కాలిక నీటిసరఫరా చేసేందుకు మోటార్లకు విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆశాఖ ఎస్ఈని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సమావేశం హాలులో నవరత్నాలు–పేదలందరికీ గృహాలు పథకంలో జరుగుతున్న పనులపై మున్సిపల్ కమిషనర్లు, తహసీల్దార్లు, ఎంపీడీఓలతో సమీక్ష నిర్వహించారు. ఇక్కడ్రు లేఅవుట్‌లో పదిరోజుల్లో పనులు పూర్తిచేసి ఇళ్ల నిర్మాణం చేసుకునేందుకు కావాల్సిన మౌలిక సదుపాయాలను కల్పించాలని పబ్లిక్ హెల్త్ ఎస్ఈని ఆదేశించారు.

సీఎం పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు

- కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి
- ముఖ్యమంత్రి ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్ తలశిల రఘురామ్‌తో కలిసి సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లా పర్యటన ఖరారైన నేపథ్యంలో అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం రాత్రి స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ నవరత్న పథకాల్లో భాగంగా పేదలకు ఇంటి స్థలాల పంపిణీ కార్యక్రమానికి ఈ నెల 26న తుళ్లూరు మండలం వెంకటపాలెంకు ముఖ్యమంత్రి రానున్నారన్నారు. అధికారులు వారి వారి పనులను పూర్తి చేయడంతోపాటు సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ముఖ్యమంత్రి వచ్చి వెళ్లేవరకు పగడ్బందీగా ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి, తెనాలి సబ్ కలెక్టర్ గీతాంజలి శర్మ, డీఆర్ఓ చంద్రశేఖరరావు, సీఆర్డీఏ అడిషనల్ కమిషనర్ సలీం బాషా, గుంటూరు ఆర్డీఓ ప్రభాకరరెడ్డి, జడ్పీ సీఈఓ జె.మోహన్‌రావు, హౌసింగ్ పీడీ సాయినాథ్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

సీఎం సభ ఏర్పాట్ల పరిశీలన

వెంకటపాలెం(తాడికొండ): సీఆర్డీయే పరిధిలో నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల పథకంలో భాగంగా ఈ నెల 26న రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా ఇళ్ల పట్టాల పంపిణీ జరగనుంది. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించే బహిరంగ సభ ఏర్పాట్లను శనివారం సీఎం ప్రోగ్రామ్స్ కో–ఆర్డినేటర్, శాసన మండలి సభ్యుడు తలశిల రఘురామ్, గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా సభాస్థలి ప్రాంతంలో వేదిక, గ్యాలరీల నిర్మాణం, పార్కింగ్ ప్రదేశాలలో చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో గుంటూరు ఆర్డీఓ ప్రభాకర్ రెడ్డి, ఆర్అండ్‌బీ ఎస్ఈ నిర్మలా, సీఆర్డీయే, రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

'జగనన్న ఆణిముత్యాలు' ఘనంగా నిర్వహించాలి

గుంటూరు వెస్ట్: ప్రభుత్వ విద్యా సంస్థల్లో అత్యధిక మార్కులు సాధించిన 10వ తరగతి, ఇంటర్ విద్యార్థులను సత్కరించేందుకు నిర్వహిస్తున్న జగనన్న ఆణిముత్యాల కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శనివారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరం నుంచి కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలల్లో విద్యనభ్యసించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులను సన్మానించడంతోపాటు మెడల్, సర్టిఫికేట్, నగదు బహూకరించాలన్నారు. ఈ నెల 25న జిల్లా, 27న రాష్ట్ర స్థాయిలో నిర్వహించాలన్నారు. ఇంటర్మీడియెట్ ఆర్ఐఓ సునీత, సమగ్ర శిక్ష ఏపీసీ విజయలక్ష్మి పాల్గొన్నారు.

ప్లస్ టూ స్కూళ్లలో 129 పోస్టుల భర్తీ

- తెలుగు పోస్టుల కౌన్సెలింగ్ రద్దు
- నేడు రీ–కౌన్సెలింగ్‌కు ఏర్పాట్లు



కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీవైఈఓ సుధాకర్

గుంటూరు ఎడ్యుకేషన్: ఉమ్మడి గుంటూరు జిల్లాలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన ప్లస్ టూ తరగతుల బోధనకు 129 మంది అసిస్టెంట్ ఉపాధ్యాయులను రీ–డిప్లాయిమెంట్ పద్ధతిపై నియమించారు. ఆయా పాఠశాలల్లో వివిధ సబ్జెక్టుల వారీగా పోస్టుల భర్తీకి శనివారం గుంటూరు పాత బస్టాండ్ సెంటర్లోని జిల్లా పరీక్ష భవన్‌లో ఏర్పాటు చేసిన ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ ప్రక్రియకు పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివచ్చారు. తెలుగు, ఇంగ్లిష్, గణితం, ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, ఎకనామిక్స్, జువాలజీ, సివిక్స్, కామర్స్ సబ్జెక్టుల వారీగా మొత్తం 174 పోస్టులను భర్తీ చేసేందుకు డీఈఓ పి.శైలజ పర్యవేక్షణలో ధ్రువపత్రాల పరిశీలన, కౌన్సెలింగ్ నిర్వహించారు. కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వివిధ పాఠశాలల్లో ఖాళీలను కోరుకున్నారు. కాగా తెలుగు 25 పోస్టులకు జాబితాలో ఉన్న ఉపాధ్యాయులతో కౌన్సెలింగ్ నిర్వహించినప్పటికీ అర్హతలు, పరిపాలనా పరమైన కారణాలతో దానిని రద్దు చేశారు. మిగిలిన సబ్జెక్టుల్లో గైర్హాజరైన ఉపాధ్యాయులు మినహా 129 పోస్టులను భర్తీ చేశారు. తెలుగు సబ్జెక్టుకు సంబంధించిన రీ–కౌన్సెలింగ్‌ను ఆదివారం ఉదయం 10 గంటలకు గుంటూరులోని డీఈఓ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కౌన్సెలింగ్‌లో పాఠశాలలను కోరుకున్న ఉపాధ్యాయులకు నియామక ఉత్తర్వులను ఆదివారం ఆయా పాఠశాలల హెచ్‌ఎంలకు మెయిల్ ద్వారా పంపుతామని చెప్పారు. సంబంధిత ఉపాధ్యాయులను ఆదివారం సాయంత్రమే విధుల నుంచి రిలీవ్ చేయాలని సూచించారు. కాగా రీ–డిప్లాయిమెంట్ పద్ధతిపై నియమితులైన ఉపాధ్యాయులు ఉన్నత పాఠశాలల్లో ప్లస్ టూ తరగతులను బోధించాల్సి ఉంది. కౌన్సెలింగ్ ప్రక్రియను గుంటూరు డీవైఈఓ కె.సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ డైరెక్టర్ నిర్మలారాణి, ఉర్దూ డీఐ షేక్ ఎండీ ఖాసిం, సీనియర్ హెచ్‌ఎంలు తిరుమలేష్, రమేష్‌కుమార్ నిర్వహించారు.

సజావుగా ఏపీఆర్‌జేసీ డీసీ సెట్

- పరీక్షలు రాసిన 1,891 మంది విద్యార్థులు
- ఏపీఆర్ క్యాట్‌కు హాజరైన 416 మంది



ఏపీఆర్‌జేసీ డీసీ సెట్‌కు హాజరైన విద్యార్థులు

గుంటూరు ఎడ్యుకేషన్: ఏపీ రెసిడెన్షియల్ జూనియర్, డిగ్రీ కళాశాలల్లో ప్రవేశానికై ఆదివారం జరిగిన ఏపీఆర్‌జేసీ డీసీ సెట్–2023కు గుంటూరు జిల్లా పరిధిలో 77.05 శాతం హాజరు నమోదైంది. గుంటూరు నగరంలోని వివిధ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో ఏర్పాటు చేసిన 10 పరీక్ష కేంద్రాల పరిధిలో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగిన ఏపీ ఆర్‌జేసీ డీసీ సెట్‌కు దరఖాస్తు చేసిన 2,454 మంది విద్యార్థుల్లో 1,891 మంది విద్యార్థులు హాజరయ్యారు. అదే విధంగా ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 5వ తరగతితో పాటు 6,7,8,9 తరగతుల్లో మిగిలిన ఖాళీలను భర్తీ చేసేందుకు నిర్వహించిన ఏపీఆర్ ఎస్ క్యాట్–2023కు దరఖాస్తు చేసిన 575 మంది విద్యార్థుల్లో 416 మంది హాజరయ్యారు. వేసవి తీవ్రత దృష్ట్యా పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు ఎదురు కాకుండా ముందస్తుగా చేసిన ఏర్పాట్లతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి.

పిడుగుపాటుకు వ్యక్తి మృతి

ఐదుగురికి తీవ్రగాయాలు



మృతిచెందిన బత్తుల సాంబయ్య

మేడికొండూరు: పిడుగుపాటుకు గురై వ్యక్తి మృతి చెందగా, ఐదుగురు తీవ్రగాయాలపాలైన సంఘటన మండలంలోని జంగంగుంట్లపాలెం వద్ద శనివారం జరిగింది. పల్నాడు జిల్లాకు చెందిన రెండు కుటుంబాలు ఉపాధి పనుల నిమిత్తం గుంటూరులోని సంగడిగుంటలో నివాసం ఉంటున్నారు. మాచర్లలోని తమ బంధువుల వివాహానికి హాజరయ్యేందు రెండు ద్విచక్రవాహనాలపై ఐదుగురు బయల్దేరారు. మార్గమధ్యంలో మేడికొండూరు మండలం జంగంగుంట్ల గ్రామ సమీపంలో రాగానే ఒక్కసారిగా ఉరుములతో కూడిన వర్షం కురుస్తుండటంతో ద్విచక్రవాహనాలు చెట్టు వద్ద నిలిపి చెట్టుకింద ఆగారు. ఇంతలో పెద్ద శబ్దంతో వారు నిలిచి ఉన్న చెట్టుపై పిడుగుపడింది. వారందరూ షాక్‌కు గురై అక్కడే పడ్డారు. ఒక మహిళ షాక్ నుంచి తేరుకుని రోడ్డుపై వచ్చి కేకలు వేయడంతో సమీపంలో ఉన్న వాహనదారులు, స్థానికులు అక్కడకు చేరుకున్నారు. 108 సహాయంతో సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి వారందరిని తరలించారు. మార్గమధ్యంలో బత్తుల సాంబయ్య(45) అనే వ్యక్తి మృతిచెందాడు. మల్లె అనూష, బత్తుల ఆదిలక్ష్మి, సాంబశివరావు, మరో ఇరువురు చిన్నారులు సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. వారిలో ఇరువురి పరిస్థితి విషమంగా ఉండటంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

పవర్‌లిఫ్టింగ్ చాంపియన్‌షిప్ ప్రారంభం



పవర్‌లిఫ్టింగ్ పోటీలను ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్

తెనాలి: పవర్‌లిఫ్టింగ్ ఇండియా, క్విక్ ఫిట్‌నెస్ ఎరీనా సంయుక్త నిర్వహణలో 10వ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జూనియర్, సబ్‌జూనియర్ క్లాసిక్ పవర్‌లిఫ్టింగ్ బెంచ్ ప్రెస్ చాంపియన్‌షిప్ –2023 (క్లాసిక్) శనివారం ఇక్కడ ఘనంగా ప్రారంభమమైంది. ఏపీ పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గుమ్మడి పుల్లేశ్వరరావు జ్యోతిప్రజ్వలన చేయగా, మున్సిపల్ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్, గుంటూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు పాటిబండ్ల రామకృష్ణ బరువులనెత్తి లాంఛనంగా పోటీలను ఆరంభించారు. గంగానమ్మపేటలోని జెట్టి అమ్మయ్య నాగభూషణం సదన్‌లో పోటీల ప్రారంభ సభకు అధ్యక్షత వహించిన అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మద్ది ప్రభాకరరావు మాట్లాడుతూ పవర్‌లిఫ్టింగ్‌లో ఆంధ్రప్రదేశ్ క్రీడాకారులు సాధిస్తున్న విజయాలు అమోఘమని చెప్పారు. అంతర్జాతీయ పోటీల్లో నాలుగు బంగారు పతకాలను సాధించిన తెనాలి పవర్‌లిఫ్టర్ ఘట్టమనేని సాయిరేవతి ఆధ్వర్యంలో పవర్‌లిఫ్టింగ్‌లో శిక్షణ, ప్రస్తుత పోటీల నిర్వహణ ముదావహమని చెప్పారు. చైర్‌పర్సన్ ఖలేదా నసీమ్ తన ప్రసంగంలో బరువు లెత్తే క్రీడలో అంతర్జాతీయంగా విజయాలను సాధించిన సాయిరేవతి విజయం వెనుక ఆమె తల్లి, అమ్మమ్మల ప్రోత్సాహం, పడిన కష్టం మరువలేనివని చెప్పారు. గుమ్మడి పుల్లేశ్వరరావు మాట్లాడుతూ ఆదాయపన్ను శాఖలో ఉద్యోగం చేస్తూ, తనలాగే మరెందరో లిఫ్టర్లను తీర్చిదిద్దేందుకు కృషిచేస్తున్న సాయిరేవతి ఆదర్శలిఫ్టర్ అని అభినందించారు. పాటిబండ్ల రామకృష్ణ తన ప్రసంగంలో తెనాలి క్రీడాఆణిముత్యం సాయిరేవతి స్ఫూర్తిగా తెనాలిలో వెయిట్‌లిఫ్టింగ్‌లో పూర్వవైభవం వస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తంచేశారు. రాష్ట్ర అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు ఘంటా వెంకటేశ్వర్లు, అనకాపల్లికి చెందిన ప్రముఖ లిఫ్టరు బదరీనాథ్, సకల సూర్యనారాయణ, సౌతిండియా ఆర్గనైజింగ్ కార్యదర్శి సకల కోటేశ్వరరావు తమ ప్రసంగాల్లో పవర్‌లిఫ్టింగ్ క్రీడాప్రాముఖ్యతను వివరించారు. కార్యదర్శి మార్నెళ్ల వెంకటేశ్వరరావు స్వాగతం పలికారు. క్విక్ ఫిట్‌నెస్ ఎరీనా నిర్వాహకురాలు సాయిరేవతి పర్యవేక్షించారు.

టంగుటూరి అందరికీ స్ఫూర్తి

అద్దంకి: ఆంధ్రకేసరి టంగుటూరి స్ఫూర్తితో విద్యార్థులంతా ముందుకు సాగాలని ఆయన మునిమనుమడు కొండపి మురళి అన్నారు. ఆంధ్రకేసరి జాతీయ పరిషత్ జీవిత సాఫల్య పురస్కారాన్ని విద్వాన్ జ్యోతి చంద్రమౌళి, రావినూతల శ్రీరాములుకు ఇవ్వనున్నట్లు ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి భైరపునేని సూర్యనారాయణ శనివారం తెలిపారు. పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 133 మంది విద్యార్థులకు టంగుటూరి ప్రకాశం పంతులు వర్ధంతి సందర్భంగా వాసవీనగర్‌లోని శ్రీనివాస కళ్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో బహుమతులు అందజేశారు.

అన్ని ప్రాంతాల అభివృద్ధే ముఖ్యమంత్రి ధ్యేయం

- శాసన సభ స్పీకర్ తమ్మినేని సీతారాం
- శ్రీశైలం వెళ్తూ మీడియాతో మాటామంతీ..
- వినుకొండ రామలింగేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి హామీ



వినుకొండ(నూజెండ్ల): గత టీడీపీ పాలకుల విధానాల వల్లే ఆంధ్రప్రదేశ్ వెనుకబడి పోయిందని, రాష్ట్రంలో అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఏపీ శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం పేర్కొన్నారు. శనివారం శ్రీశైల క్షేత్రం దర్శనానికి వెళ్తూ, మార్గ మధ్యలో వినుకొండ ఆర్అండ్‌బీ గెస్ట్ హౌస్‌కు చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పరిపాలనలో శరవేగంగా ఉత్తరాంధ్ర, రాయలసీమ, కోస్తా ప్రాంతాల అభివృద్ధి జరుగుతోందన్నారు. ఉత్తరాంధ్రలో ఎయిర్‌పోర్ట్, కోస్టల్ కారిడార్, ఏడు పోర్ట్‌లతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు. ఇటీవల ముఖ్యమంత్రుల సదస్సులో ఆంధ్రప్రదేశ్ అభివృద్ధిపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ సీఎం వైఎస్ జగన్‌ను అభినందించారని గుర్తుచేశారు. కేవలం అర్హత ఉంటే చాలు అన్ని సంక్షేమ పథకాలు వర్తించేలా రాష్ట్రంలో పరిపాలన సాగుతోందని, మరలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

ఆలయ అభివృద్ధికి కృషి

స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చేస్తున్న అనేక అభివృద్ధి కార్యక్రమాలు అభినందనీయమని స్పీకర్ తమ్మినేని మెచ్చుకున్నారు. పారిశ్రామిక వేత్తగా వేలాది మందికి ఉపాధి కల్పించడమే కాకుండా ప్రజా ప్రతినిధిగా చిత్తశుద్ధితో పనిచేస్తున్నారని కొనియాడారు. వినుకొండపై రామలింగేశ్వర ఘాట్ రోడ్డు నిర్మాణం, దేవాలయ అభివృద్ధికి ముఖ్యమంత్రితో మాట్లాడి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని చెప్పారు.

గ్రామ స్వరాజ్యం జగనన్నతోనే సాధ్యం

- రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని
- రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ, సచివాలయం, హెల్త్ క్లినిక్‌ల ప్రారంభం



రోడ్డు నిర్మాణ పనుల శిలాఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి విడదల రజిని

చిలకలూరిపేటటౌన్: గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమైందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని చెప్పారు. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం బొప్పూడి గ్రామంలో బొప్పూడి నుంచి మురికిపూడికి వరకు రూ.1.39 కోట్లతో నిర్మించనున్న తారురోడ్డు పనులకు శంకుస్థాపన, గ్రామంలో నిర్మించిన గ్రామ సచివాలయం, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌లను మంత్రి రజిని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ప్రయోజనాలు సచివాలయాల ద్వారా నేరుగా అర్హులైన లబ్ధిదారులకు సకాలంలో అందుతున్నాయన్నారు. పరిపాలనలో కనీవిని ఎరుగని స్థాయిలో సంస్కరణలు తీసుకొచ్చి జగనన్న ప్రజా పాలకుడిగా ఈ దేశానికే ఆదర్శంగా నిలచారని కొనియాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఊరూరా సచివాలయాలు, హెల్త్ క్లినిక్‌లు, రైతు భరోసా కేంద్రాలను తీసుకొచ్చిన ఘనత జగనన్నకే దక్కుతుందని తెలిపారు. ఇలాంటి ఒక నాయకుడు వందేళ్లకు ఒక్కడే వస్తారని కొనియాడారు. జగనన్న తీసుకొచ్చిన సచివాలయాల వల్ల ప్రజలకు సత్వరమే ప్రభుత్వ సేవలు అందుతున్నాయని పేర్కొన్నారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌ల వల్ల సత్వరమే ప్రజలు వైద్య సేవలు పొందగలుగుతున్నారని వెల్లడించారు. ప్రజలకు సుపరిపాలన అందించటమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఎంపీపీ దేవినేని శంకరరావు, గ్రామ సర్పంచ్ షేక్ రమేష్ బాబు, ఉప సర్పంచ్ నందిగం మేరీ, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

చిర్రావూరులో పశుసంవర్ధక శాఖ ఉపసంచాలకుడి పర్యటన

తాడేపల్లిరూరల్: ఎంటీఎంసీ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో పశువైద్యశాలను పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకులు డాక్టర్ కేదారేశ్వర్, తాడేపల్లి మండల పశు వైద్యులు డాక్టర్ నరేంద్రరెడ్డి శనివారం సందర్శించారు. చిర్రావూరు గ్రామంలోని పాడి రైతులను, గ్రామస్తులను కలసి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మండలంలోని అత్యధికంగా పశువులున్న చిర్రావూరు గ్రామంలో పశువులకు వ్యాధులు సోకినప్పుడు ప్రైవేటు డాక్టర్ వద్దకు, వేరే గ్రామానికి వెళ్లాల్సి వస్తోందని, గ్రామానికి పశువైద్యుడిని నియమించాలని కోరారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు వారానికి ఒకసారి సంచార పశువైద్య వాహనం ప్రతి గ్రామానికి వస్తుందని, గ్రామంలోని ఏహెచ్ఏ అందుబాటులో ఉంటారని, పాడి రైతులు పశు సంచార వైద్య వాహనం ద్వారా సేవలు వినియోగించుకోవాలని తెలియజేశారు. అనంతరం సీసీఎం మండల తాడేపల్లి మండల కార్యదర్శి దొంతిరెడ్డి వెంకటరెడ్డి చిర్రావూరు గ్రామంలో గేదెలు, గొర్రెలు, మేకలు అత్యధికంగా ఉన్నాయని, పాడినే జీవనాధారంగా చేసుకుని పాడి రైతులు జీవిస్తున్నారని, గ్రామంలో పశు వైద్యశాలను నిర్మించి, 10 సంవత్సరాలు అయినా నేటి వరకు పశువైద్యుడిని నియమించాలని కోరారు. పశువైద్యశాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని, సంచార పశు వైద్య వాహనాన్ని అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం గ్రామ నాయకులు పరిమిశెట్టి శివనాగేశ్వరరావు, సీపీఐ తాడేపల్లి మండల సమితి కార్యదర్శి మునునూరు సుహాస్, ఇప్పటం సొసైటీ మాజీ అధ్యక్షులు కాసినేడి బాజీగంగాధర్‌రావు, ధనేకుల పూర్ణచంద్రరావు, మొక్కపాటి సుబ్బారావు పాల్గొన్నారు.

గంజాయి బ్యాచ్ దుర్గారావు అరెస్టు

తాడేపల్లిరూరల్: విజయవాడలో నగర బహిష్కరణకు గురైన దుర్గారావు (కర్తేబియా) తాడేపల్లిలో బొల్లెద్దుల అనీల్‌తో కలసి సామాన్య ప్రజలపై దాడులకు పాల్పడడంతో బాధితులు తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎట్టకేలకు దుర్గారావు (కర్తేబియా), బొల్లెద్దుల అనీల్‌ను తాడేపల్లి పోలీసులు అరెస్ట్‌చేసి కోర్టుకు హాజరుపరిచారు. ఎస్ఐ వినోద్ కథనం ప్రకారం.. స్థానికంగా నివాసముండే బొల్లెద్దుల అనీల్ ఓ వివాహిత విషయంలో అదే ప్రాంతంలో నివాసముండే ఎస్‌కె అబీవున్నీషా కుటుంబంలోని మహిళలపై, చిన్నారులపై దాడికి పాల్పడ్డాడు. ఈ విషయమై ఈనెల 11వతేదీ మహిళలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయగా, వారిద్దరు మమ్మల్ని కూడా వేధిస్తున్నారని, స్వయాన అనిల్ అన్నయ్య కుమార్తె దేవమణి ఫిర్యాదు చేసింది. అనంతరం అదే ప్రాంతంలో నివాసముండే ఎస్‌కె బాజీ ఓ వివాహిత విషయమై మూడు నెలల క్రితం తనను కొట్టి, తన దగ్గర ఉన్న సెల్ ఫోన్ లాక్కొని ఊరి నుంచి పంపించి వేశారని ఫిర్యాదు చేయడంతో మూడు కేసులు నమోదు చేసి అనిల్‌ను, విజయవాడలో నగర బహిష్కరణకు గురైన దుర్గారావును అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. ఇదే కేసులో కిషోర్, అజయ్, మనోహర్‌లను అరెస్ట్ చేయాల్సి ఉందని, వీరు ముగ్గురు పరారీలో ఉన్నారని ఎస్.ఐ. వినోద్ తెలిపారు.